# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భరత' సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు.
2. పల్నాడు జిల్లాలో ఈరోజు నిర్వహించనున్న వనం-మనం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు పాల్గొంటారు.
3. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలను భాగస్వామ్యం చేయాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు.
4. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వాడలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమలు శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు.
5. చేనేత వస్త్రాలను ఆన్‌లైన్ ఇ-కామర్స్‌లో విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు.

==========================

రక్షణ రంగంలో 'ఆత్మనిర్భరత' సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రక్షణ శాఖా మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో భారత నౌకాదళానికి చెందిన అరిహంత్ రెండవ శ్రేణి జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాట్ ను ఆయన నిన్న జాతికి అంకితం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, భారత అణ్వస్త్ర త్రయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు దేశ భద్రతలో ఐఎన్ఎస్ అరిఘాట్ నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తోందని, ముఖ్యంగా నేటి భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో రక్షణ రంగంతో సహా ప్రతి రంగంలోనూ వేగంగా అభివృద్ధి చెందడం చాలా అవసరం అని రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.

--------------------------

తెలుగు భాషను కాపాడుకునేందుకు అందరం పునరంకితం కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నిన్న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మాతృ భాషలో అధ్యయనం చేసినప్పుడే విజ్ఞానం సమకూరుతుందని చెప్పారు. జీతం కోసం ఆంగ్లం నేర్పిస్తామని, జీవితం కోసం తెలుగును ముందుకు తీసుకెళ్తామని

వ్యాఖ్యానించారు.తెలుగు భాషను పరిరక్షిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (35 సెకన్లు)

అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలుసుకోవాలని అన్నారు. తెలుగు వ్యవహారిక భాష కోసం రామ్మూర్తి పంతులు చేసిన ఉద్యమం చిరస్థాయిలో గుర్తుండి పోతుందని తెలిపారు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో ఈ రోజు నిర్వహించనున్న వనం-మనం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. జిల్లాలోని నరసరావుపేట మండలం కాకాని పంచాయతీ పరిధిలోని జేఎన్టీయూ ఆవరణలో ఆరువేల మొక్కలు నాటనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పాల్గొని మొక్కలు నాటుతారని పల్నాడు డివిజినల్ అటవీ అధికారి రామచంద్రరావు తెలిపారు. మొక్కలు నాటిన అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలిస్తారని, తర్వాత అక్కడే జరగనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారని తెలిపారు.

-----------------------------

ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలను భాగస్వామ్యం చేయాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. నిన్న జనగామ జిల్లాలో పర్యటించిన గవర్నర్ జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ, తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరికి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వాడలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమలు శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో తిరుపతి, చిత్తూరు, విజయవాడ, గుంటూరు, కర్నూలు, కడప, పుట్టపర్తి, అనంతపురం పారిశ్రామిక వాడల అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఓర్వకల్లు, కొప్పర్తితో పాటు ఇతర పారిశ్రామిక స్థలాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామిక వాడలను అభివృద్ధి చేస్తేనే పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారన్నారు. ఇందుకు సంబంధించిన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు.

-----------------------------

చేనేత వస్త్రాలను ఆన్ లైన్ ఇ-కామర్స్‌లో విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ సభ్యులు మంత్రితో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేనేత కార్మికులకు పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. చేనేత వస్త్రాలపై వస్తు, సేవల పన్ను -జీఎస్టీని మినహాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో చేనేతలకు

అమలైన అన్ని పథకాలనూ పునరుద్ధరిస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో  హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హెచ్చరించారు. నిన్న ఆయన హైదరాబాద్‌లో మాట్లాడుతూ, భవనాల కూల్చివేతలో హైడ్రా పేరు చెప్పి కొందరు అవినీతికి పాల్పడుతున్నట్టు  ప్రభుత్వం  దృష్టికి వచ్చిందని అన్నారు. గతంలో ఇచ్చిన నోటీసుల ద్వారా నగదు అడుగుతున్నారని, కొన్ని చోట్ల రెవెన్యూ, మున్సిపల్, జలవనరుల శాఖ అధికారులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని  చెప్పారు. అక్రమమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని, వసూళ్లకు పాల్పడే వారిపై దృష్టి పెట్టాలని అవినీతి నిరోధక శాఖ అధికారులను ముఖ్యమంత్రి  ఆదేశించారు.

ఇలావుండగా మరో వైపు హైడ్రా కూల్చివేతలపై తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నిన్న  హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,నిబంధనల ప్రకారమే అక్రమ నిర్మాణాల కూల్చివేత చేపట్టాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

---------------------------

మంకీపాక్స్ వ్యాధి నిర్ధారణకు ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ అభివృద్ధి చేసిన ఆర్టీ–పీసీఆర్ కిట్ 'ఎర్బాఎండీఎక్స్'ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ మంకీపాక్స్ ఆర్టీ–పీసీఆర్ కిట్.. ప్రపంచవేదికపై 'మేక్‌ఇన్ ఏపీ' ఖ్యాతిని ఘనంగా చాటుతోందన్నారు. ఈసందర్భంగా కిట్ తయారీ బృందాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. కిట్‌లోని భాగాలు రవాణాకు అనుకూలంగా ఉన్నాయని, అంటువ్యాధుల్ని సమర్థంగా ఎదుర్కోవడంలో ప్రభుత్వ సన్నద్ధతను ఈ కిట్ చాటుతోందని పేర్కొన్నారు.

---------------------------

వ్యర్థాల నుంచి  సంపద సృష్టించేందుకు ఉన్న అవకాశాలను అందుపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర పర్యావరణ, అటవీ  మంత్రిత్వ శాఖ కార్యదర్శి లీనానందన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో "సర్క్యులర్ ఎకానమీ – పాలసీ టు ఇంప్లిమెంటేషన్" అంశంపై నిన్న నిర్వహించిన జాతీయ స్థాయి కార్యశాలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీనా నందన్ మాట్లాడుతూ,  పర్యావరణ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడమే కాకుండా,  వాటి పరిష్కారాలను కనుగొనాలన్నారు. వ్యర్థాల పెరుగుదల ఒక ప్రతికూల అంశంగా భావిస్తున్నప్పటికీ దానిని ఒక ఆర్థిక వనరుగా మార్చేందుకు ఉండే నమూనాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థల సహకారం అవసరమని  పేర్కొన్నారు.

---------------------------

నేరాలను తగ్గించేందుకు కఠిన  శిక్షలు అమలుచేయాలని తెలంగాణ  పంచాయతీ రాజ్ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క అన్నారు.నిన్న హైదరాబాద్‌లో నిర్వహించిన మహిళల భద్రతా  సమావేశంలో  మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మహిళల పట్ల గౌరవ భావంతో మెలగాలని చెప్పారు. చట్టాల పట్ల అవగాహన కల్పించేందు పాఠ్యపుస్తకాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు భద్రతకు ప్రాధాన్యం ఉండాలని,

మహిళల భద్రతా విభాగంతో సమావేశాలు ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పారిశ్రామిక ప్రోత్సాహకాలతో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. నిన్న విశాఖపట్నంలో ఆయన పాత్రికలతో మాట్లాడుతూ, వాణిజ్య సంస్థలతో చర్చలు జరిపి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తామన్నారు. విశాఖపట్నంను ఐటి కేంద్రంగా మారుస్తామని చెప్పారు. విశాఖపట్నంతో పాటు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జరిగిన భూ అవకతవకలపై దర్యాప్తు చేస్తున్నామని అన్నారు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేష్ పేర్కొన్నారు.

---------------------------

ఈ రోజు జాతీయ చిన్నతరహా పరిశ్రమల దినోత్సవం నిర్వహిస్తున్నారు. చిన్న తరహా పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించి... యువతకు ఉపాధి అవకాశాలను మరింతగా మెరుగు పరిచే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆగస్టు 30వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఆర్థికాభివృద్ధిలో చిన్న తరహా పరిశ్రమలు కీలక భూమిక పోషిస్తున్నాయి. అందువల్లనే... చిన్న తరహా పరిశ్రమలకు వున్న ప్రాధాన్యత దృష్ట్యా... వాటిని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది.

======================